సాక్షి నిజామాబాద్

బుధవారం । 12 । జూన్ । 2024



అవకతవకలపై విచారణ

స్త్రీనిధి నిధుల్లో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదుతో అమ్దాపూర్‌లో అధికారులు విచారణ చేపట్టారు.

- 10లో ▸



నకిలీ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులు

నకిలీ ధ్రువపత్రాలతో పలువురు పాస్‌పోర్టులు పొంది విదేశాలకు వెళ్తూ పట్టుబడుతున్న సంఘటనలు జిల్లాలో వెలుగుచూస్తున్నాయి.

- 10లో ▸



వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

13న పెన్షన్ అదాలత్

సుభాష్‌నగర్: ఉద్యోగుల పెన్షన్ స్కీంలో పెన్షనర్ల సమస్యలకు సంబంధించి ఈనెల 13న ఉదయం 11 నుంచి 11.40 గంటల వరకు పరిష్కారానికి సంబంధించిన ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్–1 గణేశ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు Webex వెబ్‌సైట్‌లో మీటింగ్ సెంటర్ 2641 765 4272, పాస్‌వర్డ్ పీడీఎస్1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.

వాహనాల వేలం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఉన్న జీపు, టాటా సుమోను వేలం పాట నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎక్సైజ్ అండ్ ప్రొబేషనరీ డైరెక్టర్ సోమయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ నెల 14న వేలం ఉంటుందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్

నిజామాబాద్‌అర్బన్: ఈ సెట్–2024 మొదటి విడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మంగళవారం 346 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరాం తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్ ఈనెల 14 తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

సీనియారిటీ జాబితాలో పేర్లున్న వారే రావాలి

నిజామాబాద్ అర్బన్ : ఎఫ్ఎల్‌హెచ్‌ఎం పదోన్నతికి సంబంధించి సీనియారిటీ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్ పొందుపర్చినట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాలో పేరు ఉన్నవారు మాత్రమే తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావాలని సూచించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విద్యాశాఖ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలనలో పాల్గొనాలని సూచించారు.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులో వృద్ధి

■ విద్యుత్ శాఖ ఎస్‌ఈ రవీందర్

నిజామాబాద్‌నాగారం: ఎన్పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు బాగా పెరిగాయని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రవీందర్ పేర్కొన్నారు. మే నెలలో 1,48,365 గృహ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రూ. 20.68 కోట్ల మొత్తాన్ని చెల్లించారని పేర్కొన్నారు. ప్రతినెలా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు 20 శాతం పెరుగుతున్నాయన్నారు. బిల్లు చెల్లింపు కేంద్రాల్లో గంటల తరబడి లైన్‌లో నిలబడి చెల్లించే బదులు ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్‌లు, www.tsnpdcl.com వెబ్ సైట్‌లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలో మీ యూఎస్సీ నంబర్‌ను నమోదు చేసి బిల్లులు చెల్లించవచ్చన్నారు. ప్రస్తుతం కొత్తగా బిల్లుపైనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించడాన్ని వరంగల్ సర్కిల్‌లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని.. త్వరలో నిజామాబాద్ సర్కిల్‌లో కూడా ప్రారంభిస్తామన్నారు.

మైనారిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లపై వేటు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి, లింగంపేట మైనారిటీ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఉమ్మడి జిల్లా మైనారిటీ కళాశాలల రీజనల్ కన్వీనర్ బషీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ మసూద్ అహ్మద్‌ను తొలగించి.. చందూర్ మైనారిటీ కళాశాల జూనియర్ లెక్చరర్ సుధీర్ కుమార్‌ను నియమించామని పేర్కొన్నారు. అలాగే లింగంపేట మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్‌ను తొలగించి.. పీజీ టీచర్ గోపాల్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కళాశాల నిర్వహణ, విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు.


వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ అందిస్తాం

కామారెడ్డి క్రైం: సెట్విన్ ద్వారా వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ మొయిజుద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు.

బడికి వేళాయె..

వేసవి సెలవులు ముగియడంతో బడి గంట మోగనుంది. జిల్లాలో నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు రెండు నెలల పాటు ఆటాపాటలతో గడిపిన విద్యార్థులు సెలవులకు బైబై చెప్పి బడిబాట పట్టనున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో అధికారులు ఈ ప్రక్రియలో బిజీబిజీగా మారారు.

- నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం
- నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు
- ఇంకా కొనసాగుతున్న పుస్తకాల పంపిణీ



నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పాఠశాలలు 1,756 ఉండగా 2,87,820 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 693 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 38,139 మంది విద్యార్థులు, 116 ప్రాథమికోన్నత పాఠశాలలకు గాను 9,160 మంది విద్యార్థులు, 230 హైస్కూల్స్ ఉండగా 39,912 మంది విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్ర పరిధిలో 112 పాఠశాలలు ఉండగా 15,066 మంది విద్యార్థులు ఉన్నారు. కేజీబీవీలు 25 ఉండగా 5,679 మంది విద్యార్థులు చదువుతున్నారు. మోడల్ స్కూళ్లు 10 ఉండగా 775 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు 468 ఉండగా 1,40,394 మంది విద్యార్థులున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పాఠశాలలున్నాయి.

అవే సమస్యలు..

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై బడులు తెరుచుకోనుండగా.. విద్యార్థులకు పాత సమస్యలే దర్శనమివ్వనున్నాయి. మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా సరిగ్గా పనులు చేపట్టలేదు. పాఠ్య పుస్తకాల పంపిణీ ఇంకా కొనసాగుతూనే ఉంది. పాఠశాలలు తెరవకముందే అందించాలన్న లక్ష్యం నెరవేరలేదు. జిల్లాకు ఈ ఏడాది 6,37,127 పుస్తకాలు అవసరం కాగా.. ఇప్పటివరకు 5,90,043 పుస్తకాలు వచ్చాయి, ఇంకా 47,084 పుస్తకాలు రావాల్సి ఉన్నాయి. ఇప్పటి వరకు మండల కేంద్రాలకు 3,46,955 పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం కావడంతో మరిన్ని పుస్తకాలను అందించాల్సి ఉంది.

పాఠశాలల్లో పూర్తికాని మరమ్మతులు

జిల్లాలో గత నెల ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, భవనాల మరమ్మతులు చేపట్టారు. ఇందు కోసం జిల్లాలోని 743 పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రస్తుతం 484 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. 259 పాఠశాలల్లో పలు చోట్ల పనులు కొనసాగుతుండగా.. మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అలాగే మన ఉరు – మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 401 పాఠశాలలను బాగు చేయాలని నిర్ణయించినా ఇప్పటి వరకు 31 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగతా బడుల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరికొన్ని స్కూళ్లలో పనులు కూడా ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా 438 పాఠశాలలకు అదనపు తరగతులు అవసరం ఉంది. 362 స్కూళ్లకు ప్రహరీలు లేవు. 236 బడుల్లో తక్షణ మరమ్మతులు చేయాల్సి అవసరం ఉంది.

ఖాళీలతో ఇబ్బందులు

జిల్లాలో 1,156 ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొన్నేళ్లుగా వేధిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 1,236 టీచర్ పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. చివరి సారిగా 2017లో డీఎస్సీ నిర్వహించినా.. అతితక్కువ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. మళ్లీ డీఎస్సీ భర్తీ కోసం నేటి వరకు నిరుద్యోగులు వేచి చూస్తున్నారు. గతేడాది డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసినా ఎన్నికల్ కోడ్ ఉండడంతో పరీక్ష వాయిదా పడింది. అయితే వచ్చేనెల డీఎస్సీ పరీక్ష జరుగనుంది. స్కూళ్లలో ఖాళీలు ఉండడం, విద్యావాలంటీర్లను నియమించకపోవడంతో విద్యాబోధన అస్తవ్యస్తంగా తయారైంది.

పాఠశాలల సమయం మార్పు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో సమయంలో మార్పు చేశారు. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.40 గంటల వరకు పని చేస్తాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు. అలాగే పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేయనున్నారు.

మొక్కుబడిగా బడిబాట

జిల్లాలో చేపట్టిన బడిబాట మొక్కుబడిగా సాగుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈనెల 6 నుంచి బడిబాట నిర్వహించారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కేవలం 128 మంది పిల్లలను మాత్రమే బడుల్లో అడ్మిషన్ చేయించారు. దీంతో కొన్ని రోజులుగా విద్యాశాఖ అధికారులు చేపట్టిన బడిబాటపై విమర్శలు వస్తున్నాయి.



రైతు భరోసా అందేనా!

- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- ఈ ఖరీఫ్ నుంచి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సాగు పనులు ప్రారంభమైనా అందని పంట పెట్టుబడి సాయం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ. 15 వేలు పంట పెట్టుబడి సాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చింది. దీనిని ఈ ఏడాది ఖరీఫ్ నుంచే అమలు చేస్తామని ప్రకటన చేసింది. కానీ, సాగు పనులు ప్రారంభమైనప్పటికీ ఇంత వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం మళ్లీ దీని ఊసెత్తకపోవడంతో పెట్టుబడి సాయం వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా రైతులు మాత్రం 'రైతు భరోసా' కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం 'రైతు బంధు' పేరుతో ఎకరానికి రూ. 5వేల చొప్పున ఏడాదికి రెండు సీజన్లలో పంట పెట్టుబడిని అందజేసింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగించి మొన్నటి ఎండాకాలం సీజన్‌లో పాత విధానంలోనే రైతులకు పెట్టుబడిని అందజేసింది. జిల్లాలో మొత్తం 2,73,595 మంది రైతులు 4,42,882 ఎకరాలకు గాను రూ. 271.44కోట్లు రైతుల ఖాతాల్లో పడ్డాయి. అయితే, రైతుభరోసా పథకం కింద ఖరీఫ్ నుంచి రైతులకు ఏడాదికి రూ. 15వేలు ఇవ్వాల్సి ఉంది. పెట్టుబడి డబ్బులు ఇంకా రాకపోవడంతో రైతులు సొంతంగా విత్తనాలు, మందులు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. చాలామంది సాగు పనులు ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతులకైనా పెట్టుబడి సాయాన్ని అందజేయాలని కోరుతున్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వాలి



ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఈ సీజన్ నుంచే రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందజేయాలి. ఇప్పటికే ఆలస్యమైంది. సొంత ఖర్చులతో విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేస్తున్నాం. వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు చేసి చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలి.

– ఆరే గంగాధర్, రైతు, మారంపల్లి

బోనస్ మాటేంటి..?

ఎన్నికలకు ముందు వరికి రూ. 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ గెలిచిన తర్వాత కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ఇటీవల ప్రకటించింది. దీంతో రైతులంతా దొడ్డు రకాల నుంచి సన్నాల వైపు మళ్లారు. ఎక్కువగా బీపీటీ రకాల విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సీజన్‌లో పండించిన ధాన్యానికి బోనస్ వస్తుందా లేదా అని చాలామంది రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యాపారులతో ఒప్పందం చేసుకుని సీడ్ విత్తనాలు సాగు చేస్తున్న రైతుల్లో కొంత ఆందోళన నెలకొంది. సీడ్ విత్తనాలు సాగు చేస్తున్నామని చెబితే ప్రభుత్వం బోనస్ ఇస్తుందో లేదోనని వ్యవసాయాధికారులకు సరైన సమాచారం ఇవ్వడం లేదు. రైతులు సమాచారం ఇవ్వకపోవడంతో పంటల నమోదుకు ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు.

సోషల్ స్టడీస్ టీచర్ నా రోల్ మోడల్

ప్రతిఒక్కరికి తమ జీవితంలో తొలిరోజు పాఠశాలకు వెళ్లడం మరిచిపోలేని అనుభూతి. కొందరు అల్లరి చేస్తూ.. మరికొందరు బుద్ధిగా పాఠశాలకు వెళ్తుంటారు. తన బాల్యంలో బడిబాట పట్టిన తొలిరోజు అనుభూతులను తెయూ రిజిస్ట్రార్ యాదగిరి నెమరువేసుకున్నారు.

- తెయూ రిజిస్ట్రార్ యాదగిరి
- నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన మనోగతం



తెయూ(డిచ్‌పల్లి): మా పాఠశాలలో సోషల్ స్టడీస్ బోధించే నాగమల్లు టీచర్ నాకు రోల్ మోడల్ అని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' ఆయనను పలకరించింది. తన పాఠశాల అనుభవాలు ఆయన మాటల్లోనే.. ప్రస్తుత హన్మకొండ (అప్పటి ఉమ్మడి వరంగల్) జిల్లా ఆత్మకూరు మండలం దామెర మా స్వగ్రామం. ఇప్పుడు దామెర మండలంగా ఏర్పాటైంది. అప్పట్లోనే మా గ్రామంలో హైస్కూల్ ఉండడంతో చుట్టుపక్క ల 14 గ్రామాల పిల్లలు చదువుకునేందుకు పాఠశాలకు వచ్చేవారు. 8, 9, 10వ తరగతులకు సంబంధించి ఏ, బీ, సీ మూడు గ్రూపులుగా విభజించి తరగతులు నిర్వహించేవారు.

మా నాన్న ఎం.కొమ్మాలుతో కలిసి మొదటిసారి పాఠశాలకు వెళ్లాను. ఆ రోజు పిల్లల పరిచయ కార్యక్రమంతోనే గడిచిపోయింది. శ్రద్ధగా చదువుకోవాలని ఉపాధ్యాయులు చెప్పారు. ఉపాధ్యాయులు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పేవారు. సోషల్ స్టడీ స్ టీచర్ నాగమల్లు ద్వారా జీవితంలో క్ర మశిక్షణతో ఎలా మెలగాలో తెలుసుకున్నా ను. ఆయనే నా రోల్‌మోడల్. స్కూల్‌లో ప్రా ర్థన బెల్ మోగక ముందే ఆయన పాఠశాలకు వచ్చేవారు. ఒకవేళ ప్రార్థన బెల్ కొట్టిన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా సెలవు పెట్టి వెళ్లిపోయేవారు. అంతగా ఆయన సమయపాలన పాటించేవారు. గణితం, ఇంగ్లిష్ క్లాసులు చెప్పడానికి ఉపాధ్యాయులు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు బోధించేవారు. నేను పదో తరగతిలో ఉన్నప్పుడు సెప్టెంబర్ 5న టీచర్స్ డే(స్వయం పాలన) రోజు 8, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు పాఠాలు చెప్పడం మరచిపోలేను. పదోతరగతి పరీక్షలు రాస్తున్నప్పుడు, 9వ తరగతిలో ప్రతిభకు మంజూరైన మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చిందని నాగమల్లు సార్ స్వయంగా ఆ డబ్బులు తెచ్చి ఇవ్వడం జీవితంలో మరిచిపోలేని గొప్ప అనుభూతి.

పురుగుల మందు తాగి కమిషరేట్‌కు వచ్చిన మహిళ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోకి ఓ మహిళ మంగళవారం పురుగుల మందు తాగి వచ్చిన ఘటన కలకలం రేపింది. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌కు చెందిన నర్సమ్మ స్థలం పక్కన బంధువులు ఇంటి గోడ నిర్మాణం చేపట్టారు. అయితే గోడ తన స్థలంలో నిర్మించారని నర్సమ్మ మాక్లూర్ పోలీసులను ఆశ్రయించారు. నిర్మాణ పనులను చేపడుతున్న ప్రాంతానికి ఎస్సై వెళ్లి పరిశీలించి స్థలం విషయంలో గొడవలు పడవద్దని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు నడుచుకోవాలని రెండు వర్గాలకు సూచించారు. నర్సమ్మ ప్రహరీ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులను నిలిపివేశారు. మళ్లీ పనులు మొదలుపెట్టడంతో మరోసారి కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయానికి రావాలని చెప్పారు. నర్సమ్మ తమకు సంబంధించిన వారితో కలిసి కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చింది. అధికారులతో మాట్లాడిన తర్వాత తనకు న్యాయం జరగడం లేదని భావించి.. పురుగుల మందు తాగి పోలీస్ కమిషనరేట్‌కు చేరుకుంది. సీపీ కార్యాలయంలో మహిళ పడిపోవడంతో వెంటనే పోలీసులు అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించారు. నర్సమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. నర్సమ్మ ఇంటి స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టడం వెనక కొందరు పొలిటికల్ లీడర్ల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 20 గజాల భూమిని కబ్జా చేశారని మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని బాధితురాలి కూతురు గంగాలక్ష్మి తెలిపింది.



పురుగుల మందు తాగిన మహిళ నర్సమ్మ

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్ప వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన 1,736 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కోసం 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 245 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1056.50 అడుగుల(7.57 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

లెక్కల్లో తేడా..!

ప్రాజెక్ట్ ప్రస్తుత నీటి నిల్వ లెక్కలను కొత్త నివేదిక ప్రకారం 80.5 టీఎంసీల సామర్థ్యం ఉందని అధికారులు తెలుపుతున్నారు. అయితే.. నీటిమట్టం 1056.40 అడుగుల నుంచి 1056.50 అడుగులకు.. అంటే 0.10 అడుగులు పెరగగానే నీటినిల్వ ను 1.2 టీఎంసీలు పెరిగినట్లు చూపించారు. 156.40 వద్ద నీటి నిల్వ ఉంటే 6.39 టీఎంసీలు చూపిన అధికారులు 1056.50 అడు గుల వద్ద 7.57 టీఎంసీలుగా చూపిస్తున్నారు. డెడ్ స్టోరేజీ వద్ద 0.10 అడుగుల వద్ద 1.2 టీఎంసీల నీరు పట్టే అవకాశం లేదు. కానీ నూతన సర్వే నివేదిక ప్రకారం 1056.50 అడుగుల వద్ద 7.57 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని చూపారని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. 1,736 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరితేనే 1.2 టీఎంసీల నీటి పెరుగుదల చూపడం ఆశ్చర్యంగా ఉందని ఆయకట్టు రైతులు అంటున్నారు.



ఆర్వోబీ వద్ద చీకట్లు..

- విద్యుత్ దీపాలు లేక వాహనదారుల ఇబ్బందులు
- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ఆర్వోబీ వద్ద చీకట్లో వాహనాల రాకపోకలు

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవ్‌నగర్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ వద్ద విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రివేళ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో రెండేళ్లుగా వంతెన పనులు సాగుతున్నాయి. పనులు సాగే చోట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారీన పడుతున్నారు. గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని, పిల్లర్లు కనిపించడం లేదని వాహనదారులు అంటున్నారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సూచికబోర్డులు లేకపోవడంతో అసలు రోడ్డు ఎటు వైపు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. చీకట్లు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఆర్వోబీ పనుల వద్ద రాత్రివేళలో విద్యుత్ లైట్లు లేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అక్కడున్న గుంతలు, పిల్లర్‌లు, పనులు జరిగే చోట అక్క డక్కడ ఉన్న వస్తువులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు జరిగే చోట విద్యుత్ దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.

లైట్లు ఏర్పాటు చేయాలి



మాధవనగర్ వంతెన పనుల వద్ద విద్యుత్ దీపాలు లేక రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఆది నుంచే ఆర్వోబీ పనుల వద్ద ఎలాంటి ప్రమాద, ప్రయాణ సూచికలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా స్పందించి సూచిక బోర్డులు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి.

– శంకర్, వాహనదారుడు

బడి వైపు తొలి అడుగు.. తీపిగుర్తు



నిజామాబాద్‌అర్బన్‌/రుద్రూర్‌/బోధన్‌ టౌన్‌/నవీపేట: బడివైపు వేసిన తొలి అడుగు ప్రతి ఒక్కరి జీవితంలో మరుపురాని జ్ఞాపకం. అప్పటి వరకు ఆట పాటల్లో మునిగితేలిన తమను తల్లిదండ్రులు బడివైపు నడిపించినప్పుడు ఎంతో ఉత్సాహంగా వెళ్లామని కొందరు.. మారాం చేశామని మరికొందరు తమ జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. పలకాబలపం చేతపట్టించి 'అ ఆ'లు దిద్దించిన గురువులు.. తమతో ఆడి పాడిన స్నేహితులు 'ఇప్పటికీ.. ఎప్పటికీ' గుర్తుంటారని అంటున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు వారి మాటల్లోనే...

ఎప్పటికీ గుర్తుంటుంది



నేను మొదటిసారి 1971లో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లా. మా నాన్న రాగి గోపాలయ్య మొదటిరోజు పాఠశాలకు తీసుకెళ్లాడు. పలకాబలపం ఇప్పటికీ గుర్తున్నాయి. స్కూల్‌లో ఎంతో ఆనందంగా ఉండేది. ఎక్కువగా స్నేహితులతో ఆనందంగా గడిపేవాడిని. నాటి బాల్యం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– దుర్గాప్రసాద్‌, జిల్లా విద్యాశాఖ అధికారి

మా నాన్నతో వెళ్లాను



నేను మొదటిసారిగా 1976లో నాన్న పెంటయ్యతో కలిసి మా సొంత గ్రామమైన ఎడపల్లి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లా. పుస్తకాలు ఉండేవికాదు. పలకాబలపంతోనే చదువుకునేవాళ్లం. మొదటిరోజు పాఠశాలకు వెళ్లినప్పుడు ఎంతో సంతోషంగా అనిపించింది. అవి తీపి గుర్తులు.

– రామ్మోహన్‌రెడ్డి, గిరిరాజ్‌ కళాశాల ప్రిన్సిపల్‌

ఐదు రోజులు పట్టింది..



మొదటి రోజు అమ్మానాన్నలిద్దరూ కలిసి నన్ను స్కూల్‌కి తీసుకెళ్లారు. చాలా భయం వేసింది. పాఠశాలకు అలవాటు అయ్యేందుకు ఐదు రోజుల సమయం పట్టింది. ప్రతిరోజూ అమ్మానాన్నలిద్దరూ స్కూల్‌లో వదిలేవారు. టీచర్లు స్నేహితుల్లా ఉండేవారు.

– డాక్టర్‌ ఆకుల విశాల్‌, ఇండియన్‌ మెడికల్‌ సైకియాట్రిక్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌

నాన్నతో వెళ్లాను



నేను తొలిసారి 1978లో మా గ్రామమైన ముచ్కూర్‌ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాను. పాఠశాలకు వెళ్లడమంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఇప్పటికీ ఆ రోజులు గుర్తుకువస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనే నా విద్యాబోధన కొనసాగింది.

–డాక్టర్‌ బాలరాజు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ప్రభుత్వ మెడికల్‌ కళాశాల

టీచర్‌ ఇంటికే..



నేను 1985లో తొలిసారి మా గ్రామమైన సంగమేశ్వర్‌లో టీచర్‌ ఇంటికే వెళ్లాను. మా నాన్న తీసుకెళ్లారు. అంజనా టీచర్‌ అని ఇంటి వద్దే పాఠాలు బోధించేవారు. బాగా అల్లరి చేస్తానని ఉదయం నుంచి రాత్రి వరకు టీచర్‌ ఇంటి వద్దే ఉంచేవారు.

– డాక్టర్‌ తిరుపతిరావు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, మెడికల్‌ కళాశాల

అన్నయ్య, అక్కతో కలిసి..



బోధన్‌లోని మా ఇంటికి కిలోమీటరు దూరంలో బాలికల పాఠశాల ఉండేది. తొలిసారి అక్కయ్య, అన్నయ్యతో కలిసి స్కూల్‌కు వెళ్లా. ప్రతిరోజూ కిలోమీటరు నడిచి వెళ్లేవాళ్లం. విజయలక్ష్మి టీచర్‌ ప్రభావం మాపై ఎక్కువగా ఉంది.

– శాంతకుమారి, ఎంఈవో, రుద్రూర్‌

సరస్వతి శిశుమందిర్‌లో చదివా



మంచిర్యాలలోని సరస్వతీ శిశు మందిర్‌లో చదివా. మొదటిరోజు మా నాన్న స్కూల్‌కు తీసుకెళ్లారు. పాఠశాలకు వెళ్లడమంటే ఎంతో ఇష్టంగా ఉండేది. ప్రతి ఏడాది వేసవి సెలవులు ముగియగానే స్కూల్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపేవాళ్లం.

– వెంకటనారాయణ, మున్సిపల్‌ కమిషనర్‌, బోధన్‌

తొలిరోజు భయపడ్డాను



ఎప్పుడూ ఆటల్లో ఉండేనన్ను ఉన్నట్టుండి పాఠశాలకు తీసుకెళ్లడంతో తొలిరోజు చాలా భయపడ్డాను. 1986లో మా నాన్న పాఠశాలలో చేర్పించారు. మొదటిరోజు మొత్తం ఏడుస్తూనే తరగతి గదిలో కూర్చున్నాను. క్రమంగా పాఠశాల వాతావరణం అలవాటైంది.

– లోకం సందీప్‌, ఎస్సై తానూర్‌

అమ్మతోనే బడికి తొలి అడుగు



మాది నల్గొండ జిల్లా మురుగుపల్లి. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న మా అమ్మమ్మ వారి ఊరైన గుప్పగూడెం ప్రభుత్వ పాఠశాలలో నన్ను చేర్పించారు. మా అమ్మ సాయమ్మతోనే బడికి తొలి అడుగుపడింది. అప్పట్లో ఏకోపాధ్యాయ పాఠశాల.

– ఎస్‌ జానకి, సీడీపీవో, బోధన్‌

క్లుప్తంగా

105 మంది విద్యార్థుల గైర్హాజరు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు మంగళవారం 105 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. వర్సిటీ పరిధిలోని 38 పరీక్షాకేంద్రాల్లో ఉదయం నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలకు 384 మంది విద్యార్థులకు గాను 359 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఒకటో సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 1092 మందికి గాను 1012 మంది హాజరు కాగా 80 మంది గైర్హాజరైనట్లు వివరించారు. నిజామాబాద్‌ లోని పలు పరీక్షా కేంద్రాల ను ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ తనిఖీ చేశారు.

'శ్రీచైతన్య' పుస్తకాల గది సీజ్‌



నిజామాబాద్‌అర్బన్‌: నిబంధనలకు విరుద్ధంగా నగరంలోని గూపన్‌పల్లి శ్రీచైతన్య హైస్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్నారనే కారణంతో ఎంఈవో కార్యాలయ అధికారులు మంగళవారం పాఠశాలలోని పుస్తకాల గదిని సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్‌ విభాగ్‌ కన్వీనర్‌ కైరి శశిధర్‌ మాట్లాడుతూ.. ప్రైవేట్‌ పాఠశాలల్లో ఇష్టారీతిన పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయిస్తున్నారని, ధరలు భరించలేక పేద, మధ్య తరగతి వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సదరు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఆయనవెంట జిల్లా కన్వీనర్‌ దామ సునీల్‌, నగర కార్యదర్శి జగదీశ్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ, మారుతి, రాజు, రామకృష్ణ, రాజేందర్‌ తదితరులు ఉన్నారు.

స్త్రీనిధి నిధుల అవకతవకలపై విచారణ



బోధన్‌రూరల్‌: ఐకేపీ స్త్రీనిధి నిధుల్లో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదు నేపథ్యంలో మండలంలోని అమ్దాపూర్‌లో అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఐకేపీ రీజినల్‌ మేనేజర్‌ రాందాస్‌, మేనేజర్‌ వరలక్ష్మి స్వయం సహాయక సంఘాలతో సమావేశమై గ్రూప్‌లవారీగా ఆడిట్‌ చేశారు. ఐకేపీ సిబ్బందితో కలిసి వీవోఏ అరుణ స్త్రీనిధి రుణాలు, చెల్లింపులకు సంబంధించి రూ.3లక్షల వివరాలను రికార్డుల్లో నమోదు చేయనట్లు ఆడిట్‌లో తేలిందని అధికారులు తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా రూ.3లక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని వీవోఏ అరుణను రీజినల్‌ మేనేజర్‌ ఆదేశించారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం గంగారాం, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు పోశెట్టి, బలరాజు,సాయికుమార్‌ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీకి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన రగ్బీ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు రెంజర్ల నరేశ్‌, పల్లికొండ అబ్బయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడలు బుధవారం నుంచి హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ప్రారంభమవుతాయన్నారు. ఈ మేరకు క్రీడాకారులు మంగళవారం హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

'నాట్‌ విల్లింగ్‌' ఇచ్చిన వారి పేర్లను తొలగించాలి

నిజామాబాద్‌అర్బన్‌: రెండు సార్లు నాట్‌ విల్లింగ్‌ ఇచ్చిన టీచర్ల పేర్లను పదోన్నతుల సీనియారిటీ జాబితా నుంచి తొలగించాలని యూటీఎఫ్‌ నాయకులు డీఈవోను కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాట్‌ విల్లింగ్‌ ఆప్షన్‌ ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లను తొలగించి తదుపరి అర్హత కలిగిన ఉపాధ్యాయుల పేర్లను జాబితాలో చేర్చాలని కోరారు.

అదేవిధంగా సబ్జెక్టుల వారీగా పదోన్నతుల కోసం ఏర్పడిన ఖాళీల సంఖ్యను విడుదల చేయాలన్నారు. డీఈవోను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు డి.సత్యానంద్‌, జిల్లా కార్యదర్శి జి ఆనందం, జిల్లా కమిటీ సభ్యులు ఈ శ్రీనివాస్‌, ఎం భాజన్న తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

అనుమానాస్పదస్థితిలో జింక మృతి

రాజంపేట: మండలంలోని కొండాపూర్‌లో మంగళవారం ఉదయం ఓ రైస్‌మిల్‌ వద్ద అనుమానాస్పద స్థితిలో జింక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జింక మృతి చెందిన విషయాన్ని ఫారెస్ట్‌ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఈ ఘటన అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా, రైస్‌మిల్‌ వైపు వచ్చిన జింక కుక్క అరుపులకు భయపడి పరుగుతీసి ద్వారాని గుద్దుకొని పడిపోయిందని, జింక కొనఊపిరితో ఉండగానే ఫారెస్ట్‌ అధికారులకు సమాచారం అందించామని రైస్‌మిల్‌ యజమాని తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫారెస్ట్‌ అధికారులు జింక కళేబరాన్ని పూడ్చిపెట్టామని తెలిపారు. ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

క్రైం కార్నర్‌

ఒడ్డు పైనుంచి పడి కూలీ మృతి



గంగయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భిక్కనూరు: వ్యవసాయభూమిలోని ఒడ్డు పైనుంచి పడి వ్యవసాయకూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్‌ వ్యవసాయక్షేత్రంలో కూలీ పనికి రాచకొండ గంగయ్య(65) సోమవారం వెళ్లాడు. ఆయన ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులతోపాటు రైతు శ్రీనివాస్‌ పలుచోట్ల వెతికారు. మంగళవారం ఉదయం వ్యవసాయక్షేత్రానికి వెళ్లి చూడగా ఒడ్డు పైనుంచి బోర్లా పడి మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అడ్లూర్‌ శివారులోని బ్రిడ్జి వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు దేవునిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని ఏరియా ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై రాజు తెలిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు.

జగదాంబ ఆలయంలో చోరీ



ధ్వంసమైన హుండీ

వర్ని: సైదిపూర్‌ జగదాంబ మాత ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడినట్లు ఇన్‌చార్జి ఎస్సై నాగభూషణం తెలిపారు. అమ్మవారి విగ్రహానికి ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలతోపాటు వెండి ఆభరణాలను, హుండీ ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివాలయంలో..

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని ఠాణాకలాన్‌ శివారులోని పురాతన శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టిన దుండగులు సుమారు రూ.5వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపారు.

వర్క్‌షాప్‌లో..

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న న్యూ అగ్రో ఇరిగేషన్‌ ఇంజినీరింగ్‌ వర్క్‌షాప్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ.1.50లక్షల విలువైన కేబుల్‌తోపాటు టీవీని ఎత్తుకెళ్లారు. వర్క్‌షాప్‌ యజమానికి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకొడుకుల హత్య కేసులో జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: రూ.500 విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య గొడవ జరిగి తల్లి, కొడుకు హత్యకు గురైన కేసులో నేరస్తుడికి జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్‌ జిల్లా సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్‌ మండలం మామిడిపల్లికి చెందిన శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన అనిల్‌ గౌడ్‌తో కల్లు బట్టిలో పరిచయం ఏర్పడింది. అనిల్‌ గౌడ్‌ అవసరం నిమిత్తం శ్రీనివాస్‌ నుంచి రూ.500 అప్పుగా తీసుకున్నాడు. అయితే తిరిగి ఇవ్వలేక పోయాడు. ఈ విషయమై ఇద్దరు అనేక సార్లు ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌ 2021 నవంబర్‌ 7 న అనిల్‌ ఇంటికి వెళ్లి గొడ్డలితో వీరంగం చేశాడు. అనిల్‌ గౌడ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఇద్దరి మధ్య ఘర్షణలోకి అడ్డు వెళ్లిన అనిల్‌ తల్లి రాజు బాయిపైన కూడా శ్రీనివాస్‌ దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసిన ఆర్మూర్‌ పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడు శ్రీనివాస్‌ మీద అభియోగాలు నమోదు చేశారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్‌ అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

ఇద్దరిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: పోలీసులను తోసేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై మొగిలయ్య మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం రాత్రి ఆటోనగర్‌లోని ఓ హోటల్‌లో ఇద్దరు యువకులు జాసీమ్‌, అఫ్రోజ్‌ భోజనం చేశారు. బిల్లు చెల్లించే క్రమంలో హోటల్‌ యజమానితో గొడవ జరిగింది. అర్ధరాత్రి వరకు హోటల్‌ ఎందుకు తెరిచి ఉంచారని యజమానితో యువకులు వాగ్వాదానికి దిగి 108కి ఫోన్‌ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు హోటల్‌ యజమానితోపాటు యువకులను సముదాయించే ప్రయత్నం చేస్తుండగా యువకులు దురుసుగా ప్రవర్తిస్తూ పోలీసులను తోసేశారు. పట్టుకునే లోగా జాసీమ్‌, అఫ్రోజ్‌ పరారయ్యారని, ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఒకరిపై ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్‌ ఉన్నట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్‌

మద్నూర్‌(జుక్కల్‌): వరుస చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మద్నూర్‌కు చెందిన దరాస్‌ కిరణ్‌ ఇటీవల కాలంలో మండల కేంద్రంలోని వైన్‌షాపులో చోరీకి పాల్పడి రూ.23,200 ఎత్తుకెళ్లాడు. అనంతరం జాతీయ రహదారి పక్కన ఉన్న అయ్యప్ప ఆలయం తాళాలు పగలగొట్టి నాలుగు పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లి మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో విక్రయించాడు. డోంగ్లీ మండలం మొగాలో పుల్లావార్‌ లక్ష్మణ్‌ ఇంటి తాళాలను పగులగొట్టి బీరువలోని రూ.12 నగదును ఎత్తుకెళ్లాడు. మంగళవారం దెగ్లూర్‌ వైపు నుంచి పెద్ద శక్కర్గా వైపు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులను చూసి కిరణ్‌ పారిపోతుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తానే ఇటీవల వరుస చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని, పంచలోహ విగ్రహాలు కొనుగోలు చేసిన వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎస్సై తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాలతో పాస్‌పోర్టులు

- స్థానికంగా తప్పించుకొని ఎయిర్‌పోర్టుల్లో పట్టుబడుతున్న వ్యక్తులు
- ఇమిగ్రేషన్‌ చెకింగ్‌లో వెలుగుచూస్తున్న నకిలీలలు



మోర్తాడ్‌(బాల్కొండ): బహ్రెయిన్‌ వెళ్లే క్రమంలో అవుసల నర్సయ్య అనే వ్యక్తిని శంషాబాద్‌ ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్‌ అధికారులు వారం రోజుల క్రితం అరెస్టు చేశారు. అతని పాస్‌పోర్టు నకిలీ పత్రాలతో జారీ చేసిందని గుర్తించిన ఇమిగ్రేషన్‌ అధికారులు అక్కడి పోలీసులకు అప్పగించారు. నర్సయ్య సొంత గ్రామం మోపాల్‌ మండలంలోని బోర్గాం(పి) కాగా, అతను మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ నివాసిగా నకిలీ ఆధార్‌, పదో తరగతి సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టు పొందినట్లు తేలింది. ఇలా నర్సయ్య నకిలీ పత్రాలతో పాస్‌పోర్టు పొంది ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్‌ అధికారులకు పట్టుబడటం రెండోసారి. గతంలోనూ గల్ఫ్‌కు వెళ్లే ప్రయత్నంలో నర్సయ్య పాస్‌పోర్టు నకిలీ పత్రాలతో పొందినట్లు గుర్తించి అరెస్టు చేశారు. మరోసారి అదే తప్పిదం పునరావృతమైంది. వాస్తవానికి నర్సయ్య వయస్సు 55 కాగా 45 ఏళ్ల వయస్సు ఉన్నట్లు పాస్‌పోర్టులో నమోదు చేశారు. నర్సయ్య చిరునామా మార్చడానికి నకిలీ ఆధార్‌ను తయారు చేయడంతోపాటు వయస్సును కుదించడానికి నకిలీ పదో తరగతి సర్టిఫికెట్‌ను తయారు చేయించారు. ఇలా నర్సయ్యతోపాటు గతంలోనూ అనేక మంది నకిలీపత్రాలతో పాస్‌పోర్టులు పొందడం ఇమిగ్రేషన్‌ ప్రక్రియ పూర్తి చేయించే సమయంలో విదేశాంగ శాఖ అధికారులకు చిక్కడం జరిగింది. బోర్గాం వాసికి ఎలాంటి సంబంధం లేని తిమ్మాపూర్‌ చిరునామాతో పాస్‌పోర్టును జారీ చేయించడం చూస్తుంటే నకిలీ ధ్రువపత్రాలతో పాస్‌పోర్టులను ఇప్పించే ముఠా జిల్లాలో తన కార్యకలాపాలను జోరుగా సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఎస్‌బీ ఉద్యోగుల అండదండలు?

నకిలీపత్రాలతో పాస్‌పోర్టులను పొందాలనుకునే వారు, అక్రమాలకు పాల్పడేవారికి స్పెషల్‌ బ్రాంచీలోని కొందరు ఉద్యోగులు అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో నకిలీ పత్రాలతో పాస్‌పోర్టుల జారీకి అడ్డూఅదుపు లేకుండా పోయింది. నకిలీపత్రాలతో పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు అందించడం, కొందరు ఎస్‌బీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో పాస్‌పోర్టుల జారీకి ఎలాంటి ఆటంకం లేకుండా పోయింది. ఇమిగ్రేషన్‌ సమయంలో విదేశాంగ శాఖ అధికారులు నిక్కచ్చిగా వ్యవహరిస్తుండటంతో నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు పొందినవారు పట్టుబడుతున్నారు. భీమ్‌గల్‌కు చెందిన ఓ ట్రావెల్‌ ఏజెంట్‌ను సీబీసీఐడీ విభాగం అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా ఎంతో మందికి నకిలీ ఆధార్‌, ఫేక్‌ పదో తరగతి సర్టిఫికెట్లను తయారు చేయించి ఇచ్చినట్లు తేలింది.

చేతులు మారుతున్న డబ్బు

నకిలీపత్రాలతో పాస్‌పోర్టులను జారీ చేయించడానికి పెద్ద మొత్తంలో సొమ్ము చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. నకిలీ పత్రాలను సృష్టించడం, పాస్‌పోర్టు దరఖాస్తు పరిశీలనను చూసీచూడనట్లు పూర్తి చేయించడంలో భారీ మొత్తంలో ముడుపులు అధికారులకు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పాస్‌పోర్టు జారీకి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు అక్రమార్కులు వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా పోలీస్‌ క్లియరెన్స్‌ పత్రాల(పీసీసీ)లను జారీ చేయడానికి కొందరు ఎస్‌బీ ఉద్యోగులు పెద్ద మొత్తంలో ముడుపులు స్వీకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏపికి చెందిన అనేక మంది ఇక్కడి చిరునామాతో పీసీసీలను జారీ చేయించారని తెలుస్తోంది. నకిలీపత్రాలతో పాస్‌పోర్టులు, పీసీసీల జారీ అంశంపై ఉన్నతాధికారులు స్పందించి పక్కాగా విచారణ జరిపితే అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

చంద్రశేఖరేంద్ర సరస్వతి యూనివర్సిటీలో అడ్మిషన్లకు 23న స్పాట్‌ కౌన్సెలింగ్‌



నిజామాబాద్‌రూరల్‌: చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం (డీమ్డ్‌ యూనివర్సిటీ) కాంచీపురం ఆధ్వర్యంలో ఈనెల 23న గంగాస్థాన్‌ ఫేస్‌-2లోని ఉత్తర తిరుపతి క్షేత్రం ఆవరణలో స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కౌన్సెలింగ్‌ కొనసాగుతుందన్నారు. కంచి యూనివర్సిటీలో డొనేషన్లు, మేనేజ్‌మెంట్‌ కోటా సీట్లు ఉండవని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియెట్‌ మ్యాథ్స్‌, కెమిస్ట్రి, ఫిజిక్స్‌ సబ్జెక్టులలో రెండేళ్ల మార్కుల ఆధారంగా డిగ్రీ మెరిట్‌ను గౌరవిస్తూ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌, బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, డాటా సైన్స్‌ అండ్‌ అర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ టెక్నాలజీ కోర్సుకి సంబంధించి ట్రైనింగ్‌ అడిషనల్‌ డిగ్రీ సర్టిఫికేషన్‌ ఇవ్వబడుతుందన్నారు. పూర్తి వివరాలకు కుప్ప జగన్నాథశర్మ (98496 58030), రవిచంద్ర (98667 65439), శ్రీపాద ఫణిచక్రవర్తి(98480 71008), గోపాలకృష్ణ శర్మ(94404 73706), ధారా చంద్రశేఖర్‌, ప్రజ్ఞా భారతి (94900 06800, 83284 09111), పి రవి కుమార్‌ (98482 75028)ను సంప్రదించాలని, 16వ తేదీలోగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని కోరారు.

అదృశ్యమైన యువకుడు అడవిలో మృతి



జగదీశ్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని కేశ్‌పల్లికి చెందిన యువకుడు మున్నూరు జగదీశ్‌(28) గత నెల 31న సాయంత్రం నుంచి కనిపించకుండాపోయాడు. అదే రోజు తల్లి బాలమణి ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జగదీశ్‌ ఆచూకీ కోసం ఈనెల 2న అటవీ ప్రాంతంలో పోలీసులు డాగ్‌ స్క్వాడ్‌, డ్రోన్‌ కెమెరా సాయంతో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. అయితే, యానంపల్లి అటవీప్రాంతంలో మృతదేహాన్ని గమనించిన కొందరు పశువుల కాపర్లు మంగళవారం డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ మల్లేశ్‌తోపాటు ఎస్సై మహేశ్‌ సిబ్బందితో కలిసి అటవీప్రాంతానికి చేరుకున్నారు. మృతుడిని జగదీశ్‌గా గుర్తించారు. మృతదేహం ఎముకలగూడుగా మారడంతో పంచనామా నిర్వహించి ఘటనాస్థలంలోనే పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతుడి బావ బండారి సురేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళ్లద్దాలు పడిపోవడంతో..!

అద్దాలు లేకపోతే జగదీష్‌కు కళ్లు కనిపించవని, చీకట్లో అద్దాలు పడిపోయి అతడు అడవిలో దారి తప్పి ఉంటాడని పోలీసులు తెలిపారు. మరుసటి రోజు వరకు తిరిగితిరిగి అలసిపోయి వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

భార్య తరఫువారు వేధిస్తున్నారని ఆత్మహత్య

ఖలీల్‌వాడి: భార్యతోపాటు అత్త, మామ, బావ తనను వేధిస్తున్నారని సూసైడ్‌ నోట్‌రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని నాల్గోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై సంజీవ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నసీం కాలనీకి చెందిన మహ్మద్‌ అన్వర్‌(35) ఏడు నెలల క్రితం తన భార్యతో గొడవపడ్డాడు. ఆ తరువాత ఆమె డెలివరీ కోసమని పుట్టింకి వెళ్లింది. అప్పటి నుంచి అన్వర్‌ తన తల్లిదండ్రులతోనూ గొడవపడ్డాడు. ఈ క్రమంలో తీవ్రమానసిక వేదనకు గురైన అన్వర్‌ మంగళవారం సూసైడ్‌ నోట్‌ రాసి ఉరేసుకున్నాడు. తన భార్యతోపాటు, అత్తామామ, బావ వేధిస్తున్నారని అందులో పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఇస్మాయిల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త మరణాన్ని జీర్ణించుకోలేక ..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): భర్త మరణాన్ని జీర్ణించుకోలేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని మర్కల్‌లో మంగళవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జూకంటి సుగుణమ్మ(61) భర్త ఆరు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి సుగుణమ్మ ఆందోళన చెందుతూ జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

టవల్‌ కోసం వచ్చి పట్టుబడిన దొంగలు

ఆర్మూర్‌టౌన్‌: చోరీ సమయంలో మరిచిపోయిన టవల్‌ కోసం వచ్చిన దుండగులు స్థానికులకు పట్టుబడిన ఘటన ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడి ఒక సిలిండర్‌, ఫ్యాన్‌తోపాటు రెండు బీపీ ప్యాడ్లను ఎత్తుకెళ్లారు. చోరీ చేసిన సమయంలో టవల్‌ను మరిచిపోయిన దుండగులు మంగళవారం ఉదయం మళ్లీ ఆరోగ్య ఉపకేంద్రానికి వచ్చి చోరీకి యత్నిస్తుండగా, అదే సమయంలో కాలనీలో విధులు ముగించుకుని ఏఎన్‌ఎంలు వచ్చారు. దుండగులను గమనించిన ఏఎన్‌ఎంలు స్థానికుల సహాయంతో వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పట్టుబడిన వారిని పోలీసులు విచారించగా శుక్రవారం రాత్రి సైతం చోరీకి పాల్పడింది తామేనని, దొంగిలించిన సామగ్రిని ఓ స్క్రాప్‌ దుకాణంలో విక్రయించామని తెలిపారు. పోలీసులు వారిద్దరినీ స్టేషన్‌కు తరలించారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సూర్యవంశం రోజా అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఎవరికీ చెప్పకుండా రోజా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త శ్రీకాంత్‌ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.